

# వేటూరి సాహితీ ఝరి



తెలుగుచలనచిత్రచరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని సువర్ణాక్షరాలతో లిఖించుకున్న శ్రీ వేటూరి సుందరరామమూర్తి గారు, సినీరంగప్రవేశానికి ముందే ఎన్నో కవితలు, గేయాలు, గేయరూపకాలు, కథలు, వ్యాసాలు, సినీ సమీక్షలు, సీరియల్స్ వ్రాశారన్న విషయం అందరికీ తెలిసి ఉండకపోవచ్చు. ఆ రోజుల్లో వారి కలంపేర్లు కొన్ని - శుభశ్రీ, రామం, సరళ.. వేటూరిగారి సినిమాయేతర సాహిత్యాన్ని పాఠకులకి అందించడమే ఈ శీర్షిక ముఖ్యోద్దేశం. ఈ అంశాలని కౌముదికి అందించిన, పునర్ముద్రణకి అనుమతించిన వేటూరి రవిప్రకాష్(సుందరరామమూర్తిగారి పెద్ద కుమారుడు)గారికి కౌముది ధన్యవాదాలు తెలియచేస్తోంది.

## పప్పన్నం ఎప్పుడు

### – వేటూరి సుందరరామ్మూర్తి

( 1960 - ఆంధ్రపత్రిక వారపత్రిక నుంచి)



"తిండికి మొహం వాచినట్లు కరువొచ్చి చస్తున్నట్లు పాడుగోలా వీళ్ళూనూ.. ఇంతంత కళ్ళుచేసుకుని.."

విసుక్కుంటూ నసుక్కుంటూ విసురుగా లోపలికొచ్చింది తాయారమ్మ. శనగలు కట్టిన రుమాలు సోఫాలో పారేసి తానూ కూలబడింది.

భాగవతం చదువుకుంటున్న విశ్వనాధంగారు తలయెత్తి చూసి పూతనకు అపరావతారంలా ఉగ్రురాలై ఉన్న తాయారమ్మతో 'ఏవిటే మళ్ళీ ఏం ఒచ్చిందీ?' అన్నాడు. గుండె బలహీనత మాటల్లో మలచి, ఓపికంతా చూపుల్లో పొదిపి.

రయ్యినందుకుంది తాయారమ్మ రుంజుకుంటూ.

'అహ నాకు తెలియకడుగుతాగాని తిండికి మొహం వాచి ఏడుస్తున్నారంట ఆ సుబ్బయ్యగారి రావమ్మా, పక్కింటి చుక్కమ్మానూ. పెళ్ళి కెదిగిన అమ్మాయి ఉంటే సరి – పొడుస్తారు కాకులు పొడిచినట్లు. మన బాధంతా వీళ్ళే భరిస్తున్నట్లు – '

ఇన్ని మాటలూ ఓపిక నే దున్నపోతుమీద కురిసిన వానకాగా యధాప్రకారం

విశ్వనాథం తిరిగి ప్రశ్నించాడు.

'ఇంతకూ ఏమన్నారూ – అమ్మాయి పెళ్ళిమాటేనా?'

'ఆహా అది తప్ప ఏమైనా పనుండి చస్తేగా వీళ్ళ మొహానికి. ఏవమ్మా అమ్మాయికి పెళ్ళిమాటేమన్నా అనుకున్నారా అని ఒకళ్ళు, మరి మాకు పప్పణ్ణం ఎప్పుడూ అని ఒకళ్ళు ఆపేక్షలు ఒలకబోస్తూ ఊహూ ప్రశ్నలు. నాకు నిజంగా అరికాలిమంట నెత్తికెక్కింది. ఎప్పుడు బయటపడతానా అని ఊపిరాడక ఉక్కిరి బిక్కిరై చక్కా వచ్చాను. పప్పణ్ణంట పప్పణ్ణం మరీ ఆ చుక్కమ్మను చూస్తే వళ్ళు భగ్గున మండిపోతుంది. చెట్టల్లే ఎదిగాడు కొడుక్కి తనెప్పుడు చేస్తుందో మనవాడు మొగవాడు కదా అని ధీమా....'

ఏకధాటిన ఇలా దొణదొణ పదజాలం పారబోస్తున్న తాయారమ్మతో విశ్వనాథం నింపాదిగా రొష్టుపడిపోతున్న మొహంతో పేలవంగా నవ్వుతూ మనఃపంజరంలోంచి నిజ భావకపోతాన్ని రెక్కలు నిమిరి ముఖతః వదిలిపెట్టాడు.

'ఇహ అంతటితో నోరుమూసుకో రణగొణధ్వనిగా ఒకే గోల. అన్నారంటే అన్నారు  అనరూ. ఏ వయసు కా ముచ్చటా అన్నారు. పట్నంలో కాలేజీల్లో చదివించాలని పట్టుపట్టి ఆడిందాటగా కానిస్తున్నావు. ఎప్పుడైనా అమ్మాయి మనస్సు గ్రహించావూ.

వాళ్ళు పప్పణ్ణం అడిగారంటే నీయింటి తిండికి మొహం వాచికాదు. నీవు పెట్టేపోటి ఎవరికీ చేతకాకపోలా మహలావు పెటకం పెడతావని ఎదురుచూస్తున్నారంతా – సిగ్గుండాలి మొహానికి'

పుస్తకభాగవతంలోంచి బ్రతుకు భాగోతంలోకి అడుగుపెడుతూ, ఓపిగ్గా నిష్కర్ష, నిష్ఠూర్యం, నింద, హెచ్చరికా, కోపం మొదలైనవన్నీ మాటల్లో బట్వాడా చేసిన విశ్వనాథంగారికి ఏం సమాధానం చెప్పాలో తెలీలేదు తాయారమ్మకి.

రుద్ధకంఠంతో శోకచ్ఛాయల శ్లేషతో ఎర్రబారిన ముఖం. 'అయితే తప్పంతా నాదేనంటారు? అందరూ నన్నే అనండి. కాకులు పొడిచినట్టు పొడవండి ' అని తాయరమ్మ హుమ్మస్సంతా కసిగా వెడలగక్కింది. కన్నీరుగా రాల్చింది.

'పిలుస్తే పలుకుతుంది ఏడుపు – కుళాయి తిప్పినట్టే కన్నీళ్ళు మీ దుంపతెగ వీటితో సాధిస్తున్నారు పొందే మీరు' అన్నాడు

'హు! అని నిశ్వసిస్తూ విశ్వనాథంగారు.

'అయితే ఇరవయి నాలుగ్గంటలూ సోఫాలో చతికిలబడి భాగవతాలూ, భారతాలు నా బొంద చదువుతూ కూచుంటే  అవుతుంది అమ్మాయి పెళ్ళి – నెత్తిన నోరు పెట్టుకు మొత్తుకుంటున్నా దిక్కులేదు. వాళ్ళ కళ్ళల్లో నిప్పులు పోసుకుని ఆ చుక్కమ్మావాళ్ళూ అమ్మాయి నైలాన్ చీరలు కడుతుందనీ, రెండు జడలు వేస్తుందని ముక్కుమీద వేళ్ళు మూతి విరుపులూను, అన్ని విధాలా నేను చస్తున్నాను, అందరూ నన్ను ఆడిపోసుకునేవాళ్ళే.

ఏం అది నైలాన్లు కట్టుకుంటే ఏం? ఊరేగుతే ఏం? పల్లెటూరిగొడ్డల్లే కాశాబూశెకట్టి కానీ అంత బొట్టు పెట్టుకు తిరగాలనా వీళ్ళగోల. దానిష్టం. పట్నం ఫ్యాషన్ల గోల. దానిష్టం. పట్నం ఫ్యాషన్ల ప్రకారం సాటి ఆడపిల్లలతో అది కలిసి మెలిసి ఉంటుంది – అదీ వీళ్ళకు కడుపుమంటేనా?'

విశ్వనాథంగారు భాగవతం మళ్ళీ తెరుస్తూ, కళ్ళజోడులోంచి కౌటిల్యుడే చూపుతో 'ఏమిటే అబ్బ లొడలొడ గొడవ. అన్నారని రుంజుకుంటావు. నామీద విరుచుకుపడతావ్. మాట అంటే తీసుకు తీసుకు చస్తావు. సరే పద లోపల పొయ్యిమీద అన్నం మాడిపోతోందో ఏమో!' అని సర్దుకోబోయారు.

'అహ  ఆ చుక్కమ్మ కేం పోయేకాలం? అంత చేటు వికవికలూ, పకపకలూను, అమ్మాయినీ నన్నూ చూస్తే మొన్న అది సెలవులకు వచ్చి వెడితే ఏమి తిప్పింది మూతీ ముక్కూ. దీని కొడుకు మాటేవిటి చెట్టల్లే, పాక నిట్టాడల్లే పెరిగి పెళ్ళీ పెటాకులూ లేకుండా  వాడికొచ్చినేళ్ళకి నోటి హార్మనీ వాయిస్తూ, బొమ్మల బుష్‌కోట్లు తొడగడంలా? మొగాడైతే, సరి ఏమైనా చెల్లిపోతుంది.' ఆ రాత్రి కురిసిన బ్రహ్మాండమైన వానతో తెల్లవారిపోయింది. బావి దగ్గర నీళ్ళకెళ్ళిన చుక్కమ్మా తాయారమ్మా మూతులు ముప్పై మూడు విరుపులు విరుచుకుని ఇళ్ళకు చేరారు.

ఆరోజు టపాలో రిజిష్టరు ఉత్తరం వచ్చింది విశ్వనాథం పేరిట. ఏదైనా రిజిష్టారు కోర్టు విషయమా అన్నది తాయారమ్మ పొయ్యిమీద గిన్నె కాలేసి వచ్చి.

తాపీగా చూసి, కళ్ళజోడు తీసి "బలీయసికేవల మీశ్వరేచ్ఛా" అంటూ నిట్టూర్చాడు ప్రశాంత వదనంతో విశ్వనాథంగారు.

'ఏమిటండీ? ' అన్నది ఆదుర్దాగా తాయారమ్మ.

'వినగానే సంతోషించే ఓపికొకటి కావాలి. నీ కూతురుకు మంచి జరుగుతే నీవు సంతోషించగలవా తయారూ ' అన్నాడు విశ్వనాధంగారు సాత్వికునిలా, జీవిత తాత్వికునిలా.

''ఎందుకు ఆనందించనండీ మీ పిచ్చిగానీ – ఇంతకూ ఏమయింది – ఏవైనా ప్రైజువచ్చిందా కాలేజీలో?'

'ఏమీలేదు – నీ కోరిక నెరవేరింది. పప్పన్నం అక్కర్లేకుండా అమ్మాయికి పెళ్ళయిపోయింది. నీ పంతం నెగ్గింది. '

'ఆ' అంటూ నివ్వెరపోయింది తాయారమ్మ. 'ఏమిటండీ మీరంటున్నది' అన్నది తార్మారై తలకిందులై ఆదుర్దాతో అదురుతో.

'మరేంలేదు, చుక్కమ్మ కొడుకు రమేష్ కలెక్టరయ్యాట్ట మొన్న – నీ అల్లుడయ్యాట్ట నిన్న. రిజిష్టర్ పెళ్ళి చేసుకున్నారట ఇద్దరూ. భగవచ్చిత్రం. నీకూ, చుక్కమ్మకూ భగవంతుడు రోగం 'ఠకీ'మని ఒక్కసారి కుదిర్చాడు. నీకు పప్పన్నం పెట్టే బాధ తప్పిపోయింది.'

'రమేష్ కలెక్టరా! నా అల్లుడా! ' అని ముప్పిరిగొనిపోయింది ఆనందపు ఉప్పెనలో తాయారమ్మ.

'అహ కాదు చెట్టూ... నిట్టాడిని... సిగ్గుండాలి మొహానికి' అన్నాడు విశ్వనాథం సమయాన్ని సదవకాశాం క్రింద వినియోగిస్తూ –

'చాల్లే ఊర్కోండి మరీను' అన్నది తాయారమ్మ.

'ఈమాట విన్నావుటే!?' అంటూ సంభ్రమంతో పరుగెత్తుకు వచ్చింది రామయ్యగారి సుబ్బమ్మ. చుక్కమ్మగారింటినించి సరాసరి.

'సరే పదపద లోపలికి, పొయ్యిమీద గిన్నె కాలిపోతోంది –' అన్నారు విశ్వనాధం గారు.

'మరి పప్పన్నం ఎప్పుడూ? ' అన్నది రామయ్యగారి సుబ్బమ్మ.

★★★

**COMMENTS**